సాక్షి
విశాఖపట్నం
గురువారం । 29 । ఆగస్టు । 2024



కుండపోత.. పిడుగుల మోత 8లో

సింహగిరిపై సందడిగా ఉట్ల సంబరం 8లో



న్యూస్‌రీల్

సీబీఆర్‌ఎన్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం



విమ్స్‌లో పరిశీలిస్తున్న కేంద్ర ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ అనురాధ

ఆరిలోవ: విమ్స్‌లో సెకండరీ లెవెల్ కెమికల్ బయోలాజికల్ రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్(సీబీఆర్‌ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపట్టినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అనురాధ తెలిపారు. కేంద్ర ఆరోగ్యశాఖ కమిటీ సభ్యులతో కలిసి ఆమె బుధవారం విమ్స్‌ను సందర్శించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, వైద్యులతో కలిసి సీబీఆర్‌ఎన్ సెంటర్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో పరిసరాలు అనుకూలంగా ఉన్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. సీబీఆర్‌ఎన్ సెంటర్ ఏర్పాటుకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఈ పరిశీలనకు సంబంధించిన రిపోర్టు తయారు చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు రేపు



సింహాచలం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న సింహగిరిపై పెద్ద ఎత్తున సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు పూజాసామగ్రి, అమ్మవారి ప్రతిమ, రవిక, ప్రసాదం దేవస్థానం ఉచితంగా అందిస్తుందన్నారు. కొండ దిగువ నుంచి కొండ పైకి, కొండపై నుంచి దిగువకి దేవస్థానం బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం ఉంటుందన్నారు. వ్రతాల అనంతరం స్వామివారి ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు.

గృహ నిర్మాణాలు వేగంగా జరగాలి

మహారాణిపేట: జిల్లాలోని అన్ని లేఅవుట్లలో గృహ నిర్మాణ పనులు వచ్చే సోమవారం నుంచి జరగాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిపై కాంట్రాక్టర్లు, డీఈఈ, ఈఈలు, సహాయ ఇంజినీర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 100 రోజుల్లో 70 వేల గృహాలు పూర్తిచేసేలా ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. ఇందుకు ప్రతి వారం 10 వేల ఇళ్లు పూర్తికావాల్సి ఉండగా, ఆశించిన మేర పనులు జరగడం లేదన్నారు. జిల్లాలో ఇసుక కొరత లేదని, సిమెంట్ సమస్య కూడా తీరబోతుందన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన నిధులు కూడా మంజూరు అవుతున్నాయని కాంట్రాక్టర్లకు వివరించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ జి.సత్యనారాయణ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు సీతారామ్, కె.వి.సూర్యారావు, వి.రామకృష్ణ, సహాయక ఇంజినీర్లు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మంకీపాక్స్ వార్డు



కేజీహెచ్‌లో సిద్ధం చేసిన ప్రత్యేక వార్డు

మహారాణిపేట: మంకీపాక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు కేజీహెచ్‌లో అధికారులు ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. క్యాజువాల్టీ మేడపై ఉన్న ఐసోలేషన్ వార్డులో 20 పడకలతో వార్డును ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ, చికిత్స కోసం జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి.రాధాకృష్ణ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.రత్నకుమారి, డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.శాంతి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణితో కూడిన కమిటీని నియమించారు.

'అతనికి మంకీపాక్స్ లేదు'

సాలూరుకి చెందిన 44 ఏళ్ల వ్యక్తి ఒంటి మీద ఎర్రని బొబ్బలు ఉండడంతో కుటుంబ సభ్యులు బుధవారం కేజీహెచ్ ట్రామాటాలజీ విభాగానికి తీసుకొచ్చారు. అతనికి మైక్రోబయాలజీ విభాగం వైద్యులు పరీక్షలు నిర్వహించి.. నమూనాలను పుణెకు పంపారు. ఆ వ్యక్తికి మంకీపాక్స్ లేదని, కుష్టు వ్యాధి అని సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు. అతను విదేశీ ట్రావెలర్ కాదని, ఎవరితోనూ కాంట్రాక్స్ లేవని చెప్పారు. అతనికి ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారు.

వైద్యులకు పటిష్ట భద్రత అవసరం



ఆస్పత్రుల్లో ప్రస్తుతం ఉన్న వసతులు, సౌకర్యాలు మహిళా ఉద్యోగులకు సరిపోవు. విధి నిర్వహణలో ఉండే మహిళా వైద్యులు, నర్సులకు ప్రత్యేక రూమ్‌లు అవసరం. సురక్షితమైన భద్రత ఉంటే మహిళా వైద్యులు విధులు సక్రమంగా నిర్వహించడానికి వీలు ఉంటుంది. 24 గంటల పాటు సీసీ కెమెరాల నిఘా ఉండాలి. రోగి సహాయకులపై నియంత్రణ అవసరం. పరామర్శకు వచ్చే వారికి పరిమిత వేళల్లో మాత్రమే అనుమతి ఇవ్వాలి.

– డాక్టర్ బాలి ఉమావతి, జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్, వైద్య ఆరోగ్య శాఖ



నర్సులకు భద్రత కల్పించాలి



ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులకు ప్రత్యేకంగా టాయిలెట్లు, దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక రూమ్స్ ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో ఎక్కువగా వార్డులో ఉండేది నర్సులు మాత్రమే. ఆ సమయంలో నర్సులకు అవసరమైన భద్రత కల్పించాలి. పటిష్ట చట్టాలు రూపొందించి వైద్య సిబ్బందిపై దాడులు చేసే వారిని వెంటనే శిక్షించాలి. రాత్రి వేళల్లో విధులకు వచ్చేటప్పుడు పోలీసుల రక్షణ అవసరం.

– టి.ఎస్.కల్పన మౌళి, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్, కేజీహెచ్

రీచ్‌లతో ఆట కాసుల వేట

ఇసుకాసురుల దందా



అగనంపూడి ఇసుక డిపో

దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకుందామన్న చందంగా కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. గత ప్రభుత్వం ముందుచూపుతో డిపోల్లో నిల్వ ఉంచిన ఇసుకను అత్తగారి సొత్తులా అమ్మేసుకున్నారు. ఇప్పుడు కొత్త ఇసుక రీచ్‌లు తెరవకుండా లాబీయింగ్ చేయడంతోపాటు ఇసుక కృత్రిమ కొరత సృష్టించి.. బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. వీరి తీరుతో నిర్మాణ రంగంపై ఆధారపడిన వారికి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇళ్లు కట్టుకుందామనుకున్న సామాన్యులకు రెట్టింపు ఖర్చు అవుతోంది.

- కొత్త ఇసుక రీచ్‌లు తెరవకుండా లాబీయింగ్
- టన్ను ఇసుక రూ.2 వేలకు పైగానే..
- బ్లాక్‌లో సొమ్ము చేసుకుంటున్న కూటమి నేతలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రియల్ ఎస్టేట్ రంగం
- సీటీఈ, సీటీవో అనుమతులున్నా రీచ్‌లు తెరవని శ్రీకాకుళం యంత్రాంగం
- 2 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నా టెండర్లు పిలవకుండా తాత్సారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉత్తరాంధ్రలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే విశాఖ నగరానికి ఇసుక అవసరం ఎక్కువ. ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగం వేగంగా వృద్ధి చెందుతుండగా.. అందుకు తగ్గట్టుగా ఇసుక దొరకడం లేదు. అసలు ఇక్కడ ఇసుక రీచ్‌లే లేవు. తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోని రీచ్‌ల నుంచి ఇసుక తెప్పించి.. ఇక్కడ డిపోల ద్వారా విక్రయిస్తున్నారు. ఉన్న రెండు డిపోల్లో ఇసుక లభ్యత లేక భీమిలి డిపోను మూసివేశారు. ఇక అగనంపూడి ఇసుక డిపోలో కొద్ది పాటి నిల్వలు ఉండటంతో కూటమి నేతలు బ్లాక్ దందాకు తెరలేపారు. ప్రభుత్వ ఇసుక డిపోలో ఇసుకను తీసుకుని.. బ్లాక్‌లో టన్ను ఇసుకను రూ.రెండు వేల నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు. మరో వైపు ఒడిశా నుంచి ఇసుకను తీసుకొచ్చి.. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతులు ఇవ్వకుండా.. అక్కడి జిల్లా యంత్రాంగం, ఇక్కడి ఇసుక మాఫియా కలిసి విశాఖలో నిర్మాణ రంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ రంగంపై ఆధారపడిన వారికి అవస్థలు తప్పడం లేదు.

అనుమతిస్తే రెండు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక

శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలోని కాకండ్యం గ్రామంతో పాటు గార మండలంలోని గార వద్ద రెండు డీ–సిల్టింగ్ ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఈ రెండు రీచ్‌ల్లో చెరో లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉంది. అంటే మొత్తం 2 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక వెంటనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ రీచ్‌ల్లో ఇసుక తవ్వేందుకు ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) సీటీఈ అనుమతి కూడా మంజూరు చేసింది. ఇందు కోసం టన్నుకు రూ.2.50 చొప్పున చెల్లించాలన్న పీసీబీ ఆదేశాల మేరకు ఆ జిల్లా కలెక్టర్ జిల్లా ఫండ్ నుంచి చెల్లింపులు కూడా చేశారు. ఈ తతంగం పూర్తయి నెల రోజులు గడుస్తున్నప్పటికీ.. ఇసుక తవ్వేందుకు మాత్రం ఆ జిల్లా కలెక్టర్ టెండర్లు పిలవడంలో జాప్యం చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఇసుక కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో.. ఈ జాప్యంపై విశాఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్రంగా మండిపడుతున్నారు.

కృత్రిమ కొరత సృష్టించేందుకే..!



విశాఖలో ఇసుక ఇబ్బందులు ఉన్నాయని.. శ్రీకాకుళం నుంచి అవసరమైన ఇసుక తీసుకొస్తామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా శ్రీకాకుళం జిల్లాలో రెండు రీచ్‌లను గుర్తించారు. వీటిల్లో తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలంటూ ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. ఈ నేపథ్యంలోనే కన్సెంట్ టు ఎస్టాబ్లిష్‌మెంట్(సీటీఈ)తో పాటు కన్సెంట్ టు ఆపరేట్ (సీటీవో) అనుమతులు కూడా పీసీబీ నుంచి వచ్చాయి. ఈ మేరకు టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించేందుకు అవకాశం ఉంది. అయినప్పటికీ శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం ఇసుక రీచ్‌లను అందుబాటులోకి తీసురావడం లేదు. దీని వెనుక కూటమి నేతల ఒత్తిడి ఉందని తెలుస్తోంది. ఇప్పటికే విశాఖ నగరంలో రియల్ ఎస్టేట్‌కు అవసరమైన ఇసుక దొరకడం లేదు. ఇసుక కొరత ఉందని.. తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును కొద్ది రోజుల కిందట క్రెడాయ్ బృందం విన్నవించింది. అయినప్పటికీ ఇసుక సమస్య అలానే ఉంది. కొద్ది మంది బ్లాక్‌లో ఇసుక విక్రయించి లబ్ధి పొందేందుకు వీలుగా.. నిర్మాణ రంగ కార్మికులతో పాటు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడంపై నిర్మాణదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నేతల దందా



భారీగా నిలిచిన లారీలు

ప్రస్తుతం ఇసుక కావాలంటే ఆధార్ కార్డుతో బుక్ చేసుకోవాలి. ఇదే అదునుగా భావించిన కొంత మంది లారీ ఓనర్లు, డ్రైవర్లు ఇసుక దందా కొనసాగిస్తున్నారు. వాస్తవంగా అగనంపూడి డిపో వద్ద టన్ను ఇసుక రూ.1076కు విక్రయిస్తున్నారు. అయితే భీమిలి డిపోలో ఇసుక నిండుకోవడం, అగనంపూడి డిపోకు తాకిడి పెరగడంతో ఈ ప్రాంతంలోని కొంతమంది లారీ ఓనర్లు, డ్రైవర్లు రింగ్‌గా ఏర్పడి విశాఖ జిల్లా ఆధార్ కార్డులతో ముందుగానే ఇసుక బుక్ చేసుకొని బ్లాక్‌లో రూ.2 వేలకు పైగా అమ్ముకుంటున్నారు. దీని వెనుక స్థానిక టీడీపీ నేతల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. డిపోకు వెళితే ఇసుక దొరికే పరిస్థితి లేదని.. ఓపిక మీద లైన్‌లో ఉన్నా మూడురోజులపాటు పడిగాపులు కాయాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో అవసరం ఉన్న వారు అధిక ధరకు ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఆర్థిక సదస్సుకు పక్కా ఏర్పాట్లు



ఏర్పాట్లను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాముకు వివరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: విశాఖ వేదికగా గురువారం జరగనున్న సర్క్యులర్ ఎకానమి పాలసీ అమలుపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నోవాటెల్‌లో జేసీ కె.మయూర్ అశోక్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో సెమినార్ నిర్వహణ, ఇతర కార్యకలాపాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(పర్యావరణం, అటవీ, సైన్స్–టెక్నాలజీ) అనంత రాము అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెమినార్‌లో వివిధ రంగాల నిపుణులు, సంస్థల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు సుమారు 150 మంది భాగస్వామ్యమవుతారని వెల్లడించారు. సదస్సు నోవాటెల్ హోటల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు. సదస్సుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనా నందన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నరేష్ పాల్ గంగ్వార్, రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరాము హాజరుకానున్నారు.

నేటి నుంచి మూడో విడత ఐటీఐ కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీ కోసం మూడో విడత కౌన్సెలింగ్‌ను గురువారం కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల కన్వీనర్, ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

రికార్డు 'స్థాయి'లో అంశాలు

- వచ్చే నెల 4న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం
- జీవీఎంసీ చరిత్రలో తొలిసారిగా 280 అంశాలతో అజెండా
- కౌన్సిల్‌కు వెళ్లకుండా 'విభజించి.. వసూల్ చేసేందుకు సిద్ధం
- ఇప్పటికే పర్సంటేజీలు సెట్ చేసుకున్న టీడీపీ కార్పొరేటర్లు
- మధ్యవర్తిత్వం వహించిన బదిలీపై వెళ్లిన అధికారి



సాక్షి, విశాఖపట్నం : 'నీకు 5 పర్సంట్.. నీకు 5 పర్సంట్.. నీకు 5 పర్సంట్.. వచ్చింది వచ్చినట్లు పంచుకుందాం. మన జేబులు నింపేసుకుందాం.' స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఇటీవల కొత్తగా ఎన్నికైన 10 మంది టీడీపీ సభ్యులు నిర్వహించుకున్న రహస్య సమావేశంలో చర్చించిన అంశాలివీ. కార్పొరేషన్ అభివృద్ధి ఏమైపోయినా ఫర్వాలేదు కానీ.. ప్రతి పనిలో తమకు రావల్సిన వాటా వస్తేనే ఆమోదిద్దాం అనే స్వలాభంతో టీడీపీ స్టాండింగ్ కమిటీ సభ్యులు వ్యవహరిస్తున్నారు. ఇటీవల పెన్సిల్ మార్కు ఓటు రాజకీయాలతో దొంగచాటుగా జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పది మంది టీడీపీ కార్పొరేటర్లు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది మార్చిలో సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశం జరగలేదు. దాదాపు 6 నెలల విరామం తర్వాత వచ్చే నెల 4వ తేదీన జరగనున్న స్థాయీ సంఘం సమావేశం ముందుకు భారీ అజెండా వచ్చింది.

పనులు విడగొట్టి.. ఫలితం రాబట్టేలా..

రాబోయే ఏడాది కాలంలో అందినకాడికి దోచుకోవడమే ప్రధాన అజెండాగా టీడీపీ కార్పొరేటర్లయిన స్టాండింగ్ కమిటీ సభ్యులు సిద్ధమయ్యారు. అందుకే సుమారు రూ.50 కోట్లు పై చిలుకు విలువైన 280 అంశాలతో జీవీఎంసీ చరిత్రలోనే భారీ అజెండా రూపొందించారు. ఇందులో పెట్టిన అంశాల్లో సింహభాగం 'విభజించు'కున్నవే కావడం విశేషం. రూ.50 లక్షల లోపు పనులు మాత్రమే కమిటీ ఆమోదించేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో వర్క్‌లన్నీ విడగొట్టి అజెండాలో పెట్టేశారు. ఏడాదికి లేదా ఆరు నెలలకు పిలవాల్సిన చెత్త రవాణా టెండర్లను కేవలం 5 రోజులకు ఒక ప్యాకేజీ చొప్పున విభజించి పొందుపరిచారు. గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్న కంపెనీకే లబ్ధి చేకూర్చాలని కూటమి నేతలు కుమ్మక్కయ్యారు. ఇప్పటికే సదరు కాంట్రాక్టర్‌తో పర్సంటేజీ మాట్లాడుకొని ఆయా వర్క్‌లను ఆమోదించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా ప్రతి పనినీ భిన్నమైన రీతిలో తమకు అనుకూలంగా విడగొట్టి అజెండాలో పెట్టేశారు.

పోతూ పోతూ చక్కబెట్టేశారు

స్టాండింగ్ కమిటీ అజెండా సిద్ధం చేసే అధికారి ఇటీవలే బదిలీ అయ్యారు. వాస్తవానికి 28న కమిటీ సమావేశం జరగాల్సి ఉంది. కానీ అంశాలు పెంచి కూటమి కార్పొరేటర్లకు లబ్ధి చేకూర్చేందుకు కావాలనే వాయిదా వేసినట్లు తెలుస్తోంది. మొత్తం 340కి పైగా అంశాలు ఉండగా.. ఇందులో స్టాండింగ్ కమిటీ సభ్యులకు, తనకూ పర్సంటేజీలు ఇచ్చే అంశాల్ని ఎంపిక చేశారు. సదరు కాంట్రాక్టర్లతో సంప్రదింపులు జరిపి.. ఎంత మేర పర్సంటేజీలు ఇవ్వాలనే అంశంపై మధ్యవర్తిత్వం వహించినట్లు తెలుస్తోంది. సోమవారం అర్ధరాత్రి వరకూ ఈ అడ్డగోలు వ్యవహారంపై చర్చలు సాగించిన సదరు అధికారి అజెండా సిద్ధం చేసిన తర్వాత.. విధుల నుంచి రిలీవ్ అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 12 తర్వాత కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ సమావేశంలో చర్చించాల్సిన అంశాల్ని కూడా విభజించి 'స్టాండింగ్' అజెండాలో పొందుపరిచారని విమర్శలొస్తున్నాయి. టీడీపీ కార్పొరేటర్లు తొలి సమావేశంలోనే భారీ 'స్థాయి'లో దోచుకునేందుకు పక్కా ప్లాన్ వేశారంటే.. భవిష్యత్తులో కార్పొరేషన్ ఖజానా మొత్తం ఖాళీ చేస్తారేమోనంటూ కొందరు ఉద్యోగులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తుండటం కొసమెరుపు.

బదిలీలు.. పైరవీలు!

- మరో 2 రోజుల్లో ముగియనున్న ఉద్యోగుల బదిలీ గడువు
- పలు శాఖల్లో బదిలీలకు ప్రత్యేక రేటు, రూ.లక్షల్లో బేరసారాలు
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతోనే బదిలీల పర్వం



మహారాణిపేట : కోరుకున్న చోటుకు బదిలీ కావాలంటే సిఫార్సు లెటరే మంత్రదండం. ఈ చేతిలో కట్టలు పెట్టు.. ఆ చేత్తో లెటర్ పట్టు అంటూ ప్రజాప్రతినిధులు ఇచ్చిన బంపర్ ఆఫర్‌తో ఉద్యోగులు సిఫార్సు లేఖలతో కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సార్.. ఫలానా చోటుకు నాకు బదిలీ కావాలి అని లెటర్ పెడుతూ దానికి ప్రజాప్రతినిధి ఇచ్చిన లెటర్‌ను జతపరుస్తున్నారు. ఇలా జిల్లాలో అక్రమ బదిలీలు, పైరవీలకు ప్రజాప్రతినిధులు తెరలేపారు. మరో రెండు రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు పూర్తి కానుండడంతో పైరవీలు జోరుగా సాగుతున్నాయి.

నిబంధనలన్నీ కాగితాలకే..

జిల్లాలో 14 ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేపడుతున్నారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ఒకే దగ్గర ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి తప్పనిసరిగా స్థాన చలనం కల్పిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి పనిచేసిన వారికి, 40 శాతానికి మించి వైకల్యం ఉద్యోగులకు ధ్రువీకరణ పత్రం అందిస్తే బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఐటీడీఏ, మన్యం ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టుల భర్తీ తర్వాత మిగిలిన ప్రాంతాల్లో పోస్టులను భర్తీ చేయాలన్న నిబంధన పెట్టారు. అయితే బదిలీల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎంటరైన తర్వాత నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి.

ఈ సాయంత్రం కొలిక్కి..!

నగరంలో గురువారం ఆర్థిక సదస్సు జరగనుంది. ఈ సదస్సు తర్వాత మూడు జిల్లాల కలెక్టర్లు సమావేశమై బదిలీలను కొలిక్కి తీసుకొచ్చే అవకాశం ఉంది. విశాఖ జిల్లాలో పోస్టింగ్ కోసం ఇప్పటికే 15 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పనిచేస్తున్న అనేక మంది తహసీల్దార్లు విశాఖ జిల్లాలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మంచి పోస్టుల కోసం తహసీల్దార్లు ఎమ్మెల్యే సిఫార్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ఇతర విభాగాల్లోనూ..


పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో బదిలీల పర్వం మొదలైంది. ఈఈలు, డీఈలు, ఇతర సిబ్బంది బదిలీ కోసం చీఫ్ ఇంజినీర్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఉద్యోగుల వివరాలు సేకరించారు. జాబితాలు సిద్ధం చేశారు. ఈ బదిలీలను సంబంధిత శాఖల ఈఎన్‌సీకి ఇస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ బదిలీల్లో కూడా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీ రాజ్‌లో కీలకమైన జెడ్పీ సీఈవో పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన జెడ్పీ సీఈవో ఒక మంత్రి వద్ద పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎంపీడీవో పోస్టుల్లోనూ పైరవీలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యేలను మచ్చిక చేసుకొని నచ్చినచోట వెళ్లడానికి కొంత మంది అధికారులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. డ్వామా, పర్యటక శాఖ, బీసీ, ఎస్సీ, సాంఘిక సంక్షేమ శాఖల్లో పోస్టుల కోసం భారీగా పైరవీలు జరుగుతున్నాయి. మొత్తంగా బదిలీల జాతర కూటమి నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది.

రెవెన్యూలో 60 సిఫార్సు లేఖలు!

రెవెన్యూ శాఖలో అన్ని కేడర్లలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ బదిలీలు చేయాల్సి ఉంటుంది. అల్లూరి జిల్లా కలెక్టర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్లతో సంప్రదింపులు జరిపిన తర్వాత ట్రాన్స్‌ఫర్స్ చేయనున్నారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్, తహసీల్దార్ కార్యాలయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్స్, ఇతర కేడర్ల బదిలీలపై తుదిగా విశాఖ కలెక్టర్ సంతకం చేస్తారు. ఈ కారణంతో కలెక్టర్ కార్యాలయానికి 60 సిఫార్సులు లేఖలు వచ్చినట్టు తెలిసింది. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి ఈ లేఖల్ని కొందరు ఉద్యోగులు తీసుకొచ్చినట్లు సమాచారం. వీటితో పాటు వివిధ కేడర్ల ఉద్యోగుల నుంచి కూడా రిక్వెస్ట్ లెటర్లు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నాయి.

14న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్‌లో లేదా 0891 – 2560414, 2575046 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్‌హెచ్ కమిషనర్ సిరి

ఫిర్యాదులొస్తే ఉపేక్షించేది లేదు

వైద్య సిబ్బందికి డీఎస్‌హెచ్ కమిషనర్ హెచ్చరిక

అగనంపూడి: వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులొస్తే ఉపేక్షించేది లేదని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ గ్రేడ్ హెల్త్(డీఎస్‌హెచ్) కమిషనర్ అట్టాడ సిరి హెచ్చరించారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రిని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులు, వారి సహాయకులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో అందుతున్న సేవలు, ఆహారం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఎందుకు సిజేరియన్ చేసుకోవాల్సి వచ్చింది.. సేవలకు ఎవరైనా డబ్బులు అడిగారా అని బాలింతలను ప్రశ్నించారు. రాత్రి విధులు నిర్వర్తించే వైద్యుల సేవలపై ఆరా తీసి, అవసరమైతే తప్ప రిఫరల్ చేయవద్దని సూచించారు. రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది, వైద్యులు తమ రోజువారి విధుల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. కమిషనర్ ముందుగా ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, ఓపీలోని రోగులతో మాట్లాడారు. మరుగుదొడ్లు, వార్డులను పరిశీలించి.. పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ల్యాబ్ సిబ్బందిపై ఫిర్యాదులు

ల్యాబ్ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని పురుష వార్డులోని ఓ రోగి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కదల్లేని స్థితిలో ఉన్నా ల్యాబ్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రక్త పరీక్షల కోసం వచ్చే రోగులను గంటల తరబడి క్యూలో నిల్చోబెట్టి, సిబ్బంది ఫోన్లలో మాట్లాడుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆస్పత్రిలో ఉన్న కమిషనర్, తర్వాత వైద్యులతో సమావేశమయ్యారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, రిఫరల్ కేసులు తగ్గేలా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, ఆర్‌ఎంవో ఉషాను ఆదేశించారు. నాడు–నేడులో భాగంగా నిర్మిస్తున్న నూతన భవనాలను అందుబాటులోకి తీసుకువస్తే చాలా వరకు ఇబ్బందులు తప్పుతాయని రోగులు కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త శంకర్ ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ పార్థివదేహం మెడికల్ కాలేజీకి అప్పగింత



మెడికల్ కాలేజీకి భగవాన్ పార్థివదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట: డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల విశ్రాంత అధ్యాపకుడు, భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎం.టి.భగవాన్(77) బుధవారం కన్నుమూశారు. ఎంవీపీకాలనీకి చెందిన ఆయన 2013లోనే సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తన శరీరాన్ని మెడికల్ కాలేజీకి దానం చేస్తానని రాసి ఇచ్చారు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు ట్రస్ట్ ప్రతినిధులు వై.నూకరాజు, ఐ.సురేఖ ఆధ్వర్యంలో భగవాన్ కళ్లను ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి, పార్థివదేహాన్ని గాయత్రి మెడికల్ కాలేజీకి అందజేశారు. భగవాన్ కుమార్తె దివ్య, అల్లుడు మహేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పటిష్ట చట్టాలు రూపొందించాలి



ఆస్పత్రుల్లో మహిళలకు ప్రత్యేకంగా సదుపాయాలు లేవు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. రాత్రి వేళ విధులు నిర్వర్తించే వైద్యులు, సిబ్బందికి మరిన్ని సౌకర్యాలు కల్పించాలి. రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ చేయాలి. మహిళా ఉద్యోగుల రక్షణకు పటిష్ట చట్టాలు అమలు చేయాలి.

– **డాక్టర్ పి.వి.సుధాకర్**, విశ్రాంత ప్రిన్సిపాల్, ఆంధ్రా మెడికల్ కాలేజీ



మహిళా సెక్యూరిటీ ఉంటే మంచిది



కొన్ని ఆస్పత్రుల్లో నర్సులకు ఎలాంటి సదుపాయాలు లేవు. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు డ్యూటీలో ఉండే నర్సులు ఎన్నో ఇబ్బందులతో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ సమయంలో రౌండ్లకు వెళితే ఎలాంటి సెక్యూరిటీ ఉండదు. ఆస్పత్రిలో ఉండే సెక్యూరిటీ, మహిళా పోలీసులను వైద్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయాల్లో మహిళా సెక్యూరిటీ ఉంటే మంచిది.

– **సీహెచ్ అమూల్య కుమారి**, నర్సింగ్ సూపరింటెండెంట్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి

కుండపోత.. పిడుగుల మోత



విశాఖ- భీమిలి రోడ్డులో కూలిన చెట్టు





పోలీస్ బ్యారెక్స్ వద్ద కురుస్తున్న వర్షం

సాక్షి, విశాఖపట్నం: మహా నగరంలో ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం వరకూ ఉక్కపోతతో విలవిల్లాడిన నగర ప్రజలు సాయంత్రమయ్యే సరికి మబ్బులు వాతావరణంతో కాస్త సేదతీరారు. 6 గంటలకు మొదలైన వర్షం రాత్రి 7.30 వరకూ దంచి కొట్టింది. తర్వాత కాస్త విరామమిచ్చి 8 నుంచి 10 గంటల వరకూ మోస్తరు జల్లులు కురిశాయి. నగరానికి సమీపంలో కొన్ని చోట్ల 68 కిలో యాంపర్స్ శక్తితో ఉరుములు భయాందోళనలకు గురిచేశాయి. కుండపోతగా కురిసిన వర్షంతో పలుచోట్ల రహదారులు జలమయమయ్యాయి. ట్రాఫిక్ స్తంభించింది.

ప్రాంతం	వర్షపాతం (మి.మీల్లో)		
సింహాచలం	49.75	సీతమ్మధార	40.0
గంభీరం	48.75	గోపాలపట్నం	37.0
భీమిలి	44.75	పెదగంట్యాడ	36.0
కాపులుప్పాడ	44.5	ఆరిలోవ	31.75
పెందుర్తి	42.0	మహారాణిపేట	31.75
హెచ్‌బీ కాలనీ	40.75	వేపగుంట	31.5
		అక్కిరెడ్డిపాలెం	31.0
		మధురవాడ	30.5

ప్రాణం తీసిన ‘పెట్రోల్’

అగ్నికి ఆహుతైన మహిళ



చల్లయ్యమ్మ(ఫైల్)

ఆరిలోవ: అనధికారికంగా నిర్వహిస్తున్న పెట్రోల్ వ్యాపారం ఓ మహిళ ప్రాణం తీసింది. పెట్రోల్‌తో ప్రమాదమని తెలిసినా.. లాభం వస్తుందనే ఆశ.. ఆమె పాలిట మృత్యువైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెదగదిలిలో సియ్యాద్రి చల్లయ్యమ్మ(55) తన కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటోంది. తమ ఇంటి ముందు వారు చిన్న దుకాణం పెట్టుకుని.. కిరాణా సామాన్లతో పాటు అనధికారికంగా పెట్రోల్ విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా బంక్ నుంచి పెద్ద డబ్బాల్లో పెట్రోల్ తీసుకువచ్చి ఇంట్లో నిల్వ ఉంచుకునేవారు. అవసరమైన వారికి బాటిళ్లతో పెట్రోల్ విక్రయిస్తున్నారు. కాగా, బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చీకటి కావడంతో చల్లయ్యమ్మ ఇంట్లోకి వెళ్లి కొవ్వొత్తి వెలిగించింది. ఆ సమయంలో పక్కనే ఉన్న డబ్బాల్లోని పెట్రోల్‌కు మంట అంటుకుంది. ఈ క్రమంలో ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. ఆ మంటల్లో చల్లయ్యమ్మ చిక్కుకుపోయి అగ్నికి ఆహుతైంది. ఇంట్లో సామాన్లు అన్నీ కాలిబూడిదయ్యాయి. ఆ సమయంలో కుటుంబ సభ్యులు దుకాణం వద్ద ఉన్నారు. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారంతో ఆరిలోవ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని .. మంటలను అదుపు చేశారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించి, ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. పెట్రోల్ ఇంట్లో నిల్వ ఉంచడం వల్ల చుట్టు పక్కల వారికి కూడా ప్రమాదమని ఆమెకు ఎన్నో సార్లు చెప్పామని.. అయినా వినలేదని స్థానికులు తెలిపారు.

సింహగిరిపై సందడిగా ఉట్ల సంబరం

శ్రీకృష్ణాలంకారంలో అప్పన్న స్వామి దర్శనం





శ్రీకృష్ణాలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, తాడుని లాగుతున్న స్థానాచార్యులు, పురోహిత్ అలంకారి

సింహాచలం: శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం సింహగిరిపై ఉట్ల సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా డోలీలో ఉంచి ఆలయ రాజగోపురం వద్ద అధిష్టింపజేశారు. రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన ఉట్టిని యాదవులు అందుకోవడానికి ప్రయత్నించగా.. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తాడు లాగుతూ సందడి చేశారు. అనంతరం స్వామికి వెన్న, పాలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. భక్తులు ఉట్ల సంబరాన్ని తిలకించి స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

‘ఏపీ మెకనైజ్డ్’ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మణరావు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మైలపల్లి లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫిషింగ్ హార్బర్‌లో బుధవారం మాజీ కార్పొరేటర్ పేర్ల విజయచందర్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఎఫ్‌డీవో మురళీ, వన్‌టౌన్ సీఐ పి.భాస్కరరావు, మహారాణిపేట డిప్యూటీ తహసీల్దార్ చేతన్ సమక్షంలో ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం లక్ష్మణరావు మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే కార్యవర్గం ఏర్పాటు చేస్తామన్నారు. హార్బర్‌లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు, నాయకులు ముస్నం బాలాజీ, సత్తిరాజు, గరికిన పరశురాం, సీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘరానా దొంగ అరెస్ట్



నిందితుడు కొట్టిసా లక్ష్మణనాయుడు

విశాఖ సిటీ: ఒంటరిగా ఉన్న మహిళలే లక్ష్యంగా వల వేసి, మత్తు ఇచ్చి బంగారు ఆభరణాలు, డబ్బు కాజేస్తున్న ఘరానా దొంగను దువ్వాడ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 23న సాయంత్రం 7.30 గంటలకు వడ్లపూడి మెయిన్‌రోడ్డు వద్ద కూరగాయలు విక్రయిస్తున్న మహిళ దగ్గరకు ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. ఆమెతో మాటలు కలిపి కొంచెం సేపు అక్కడే ఉండి.. దుకాణం మూసివేసే సమయానికి చెరుకురసం తీసుకొచ్చి ఇచ్చాడు. ఆమె అది తాగి ఇంటికి వెళ్లి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి ఆమె మెడలోని బంగారు గొలుసు, చెవులీలు, బీరువాలో ఉంచిన డబ్బు, ఏటీఎం కార్డు కనిపించకుండాపోయాయి. దీంతో ఆమె ఈ నెల 24న దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇటువంటి తరహా కేసులు గాజువాక, ఎయిర్‌పోర్ట్, ఇతర చోట్ల జరిగినట్లు గుర్తించిన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి.. జోన్-2 క్రైమ్ ఏసీపీ సి.హెచ్.శ్యామలరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సదరు క్రైమ్ టీం సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి చోరీకి పాల్పడింది శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన పాత నేరస్తుడు కొట్టిసా లక్ష్మణనాయుడు(50)గా గుర్తించింది. ఈ నెల 27న సాయంత్రం 4 గంటలకు దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద అతడిని అరెస్టు చేశారు. మహిళ నుంచి చోరు చేసిన బంగారం, డబ్బును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు నేరాలకు పాల్పడి చాలా సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు.

చోరీ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

విశాఖ లీగల్: దొంగతనం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, రూ.6,000 జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ప్రదీప్ కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలివీ.. నిందితుడు షేక్‌ది ఆరిలోవ ప్రాంతం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫైనాన్స్ మేనేజర్ బి.సూర్యం ఇంట్లో 2023 జూలై 18న బంగారం, సెల్ ఫోన్లు, రూ.9 వేలు నగదు చోరీ చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.మాధవరావు నిందితుడిపై నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. షేక్‌ను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

దొడ్డిదారిలో ఎన్నికలు

వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట: ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు సీక్రెట్ బ్యాలెట్ ద్వారా జరగాలని గత సర్వసభ్య సమావేశంలో మెజారిటీ సభ్యులు కోరారని ఆ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను బుధవారం కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిగితే ఓడిపోతానని భావించి సురపతి నర్సింగరావు పోటీ నుంచి తప్పుకున్నారని తెలిపారు. పోటీదారుడు లేకపోవడంతో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా తన పేరు ప్రకటించాల్సి ఉందని ఆయన చెప్పారు. తనకు తెలియకుండా అసోసియేషన్ గుమస్తా ఇంటికి వెళ్లి బెదిరించి కార్యాలయ తాళాలు తీసుకున్నారని జానకీరామ్ ఆరోపించారు. చట్టవిరుద్ధంగా రిక్షా కార్మికులు, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులను అసోసియేషన్ కార్యాలయంలో ఉంచి దొడ్డిదారిలో ఎన్నిక నిర్వహించారన్నారు. బోటు యజమానుల హక్కులను కాలరాస్తూ నిర్వహించిన ఎన్నికలు చెల్లవని, బోటు యజమానులంతా తన పక్షానే ఉన్నారని చెప్పారు. ఓటమి భయంతోనే పి.సి.అప్పారావు వర్గం ఇలాంటి దుశ్చర్యలకు పూనుకుందని, దీనిపై న్యాయపోరాటం చేస్తానని జానకీరామ్ స్పష్టం చేశారు.

‘కాంబోడియా’ కేసులో ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్

విశాఖ సిటీ: డేటా ఎంట్రీ ఆపరేటర్ల పేరుతో యువతను కాంబోడియాకు పంపించి చైనా సైబర్ గ్యాంగ్ ముఠాకు అప్పగిస్తున్న ఇద్దరు ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని విచారించగా.. ఆసక్తిగల విషయాలు వెలుగులోకి వచ్చాయి. గోపాలపట్నంలో పెద నరవ ప్రాంతానికి చెందిన దివ్వల లక్ష్మణరావు అలియాస్ శ్రీధర్.. బొంగు మురళి అనే ఏజెంట్ ద్వారా కాంబోడియా వెళ్లాడు. అక్కడ ఏజెంట్ ఎటువంటి ఉద్యోగం చూపించకపోవడంతో అక్కడే వివిధ రకాల సైబర్ స్కాం జాబ్స్ చేసేందుకు నిరుద్యోగులు అవసరమని గ్రహించాడు. కాంబోడియాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల పేరుతో వ్యక్తులను పంపించడం ద్వారా సులువుగా డబ్బులు సంపాదించవచ్చని నిర్ణయించుకున్నాడు. కాంబోడియాలో పనిచేస్తున్న తమిళ వ్యక్తి ఎస్.మణివన్నన్ ఫోన్ నంబర్ తీసుకుని అక్కడి నుంచి విశాఖకు తిరిగి వచ్చేశాడు. మురళీనగర్ ప్రాంతంలో జీసీక్యూ సర్వీసెస్ అనే సంస్థను ప్రారంభించాడు. తాను ముందుగా ఉద్యోగం కోసం ప్రయత్నించిన హెచ్ఐఈఎస్ గ్లోబల్ కన్సల్టెన్సీలో మేనేజర్‌గా పనిచేస్తున్న బెంగళూరుకు చెందిన అనంతహరి ప్రసాద్‌ను కలిశాడు. విదేశాలకు డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా వెళ్లే వారు ఉంటే తన వద్దకు పంపించాలని, ఇందుకు కమిషన్ కూడా ఇస్తానని చెప్పాడు. అభ్యర్థులు నెలకు 800 నుంచి 1100 డాలర్ల వరకు సంపాదించుకోవచ్చని తెలిపాడు. కొద్ది రోజులకు కొండేటి రామాంజనేయులు అనే వ్యక్తిని కంబోడియా పంపించి అక్కడ చైనా ముఠాకు అప్పగించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు రాగా ఏజెంట్లు లక్ష్మణరావు, అనంత హరిప్రసాద్‌లను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు పంపించారు. దీని వెనుక ఉన్న ప్రధాన ముఠాను కనిపెట్టడానికి ప్రత్యేక బృందాలతో లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

31న పూరీ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం గాంధీధాం-పూరీ(22973) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తంబరం-సంత్రగచ్చి(22842) అంత్యోదయ్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి. ఈ నెల 31న పూరీ-గాంధీధాం(22974) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

దంతేవాడ వరకు మాత్రమే కిరండూల్ రైళ్లు

కేకే లైన్ పరిధి బచేలి-కిరండూల్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ● విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ గురువారం నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. ● ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ దంతేవాడ నుంచి బయలుదేరుతుంది. ● ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. ● ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయలుదేరుతుంది. ఈ తేదీల్లో దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

నేడు మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ రాక

మహారాణిపేట: జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ ఎస్.విజయభారతి ఈనెల 29న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో రాత్రి 8.10 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. 30న మధ్యాహ్నం 2 గంటలకు ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ విద్యార్థులతో, మధ్యాహ్నం 3.30 గంటలకు బి.వి.కె. డిగ్రీ కాలేజీ, పీజీ కాలేజీ విద్యార్థులతో సమావేశమవుతారు. 31న స్థానిక కార్యక్రమంలో పాల్గొని అదే రోజు రాత్రి 8 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళ్తారు.

మంత్రి లోకేష్ విశాఖ రాక



విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

గోపాలపట్నం: రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, ఆర్డీఏ హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్ రమేష్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి.. స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డుమార్గంలో మంత్రి నగరానికి వెళ్లారు.

నిరసనల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ సర్వే నంబర్ 104లో మెస్సర్స్ వీఆర్ ఇన్‌ఫ్రా అండ్ టెక్నాలజీస్‌కు లీజు ఇచ్చే అంశంపై బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయసేకరణ వాయిదా పడింది. ముందుగా జేసీ మయూర్ అశోక్ స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. తర్వాత మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ షేక్ సుభాని క్వారీకి సంబంధించిన డ్రాఫ్ట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ రిపోర్ట్ చదువుతుండగా... బ్లాస్టింగ్‌కు ఒప్పుకోబోమని స్థానికులు, సీపీఐ, సీపీఎం నాయకులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్, ఆనందపురం తహసీల్దార్ శ్యాంప్రసాద్ స్థానికులకు సర్దిచెప్పాలని చూసినా శాంతించలేదు. దీంతో సభను వాయిదా వేస్తున్నట్టు జేసీ ప్రకటించారు. మైనింగ్ వలన కలిగే నష్టాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు షిణగం దామోదరరావు, కాళ్ల గౌరి తదితరులు వినతిపత్రం అందించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, సీపీఐ గ్రేటర్ విశాఖ నగర కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు, భీమిలి డివిజన్ సీపీఎం జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి తదితరులు మాట్లాడారు.

మైనింగ్‌పై భీమిలి ఎమ్మెల్యే తన వైఖరి ప్రకటించాలి

డాబాగార్డెన్స్: కుసులువాడలో మైనింగ్‌పై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన వైఖరి తెలియజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు.

500 గ్రాముల బంగారం పట్టివేత

సీతమ్మధార: బిల్లులు లేకుండా బంగారం తీసుకువెళ్తున్న వ్యక్తులను ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ధర్మేంద్ర తెలిపిన వివరాలు ఇలా.. నగరానికి చెందిన ఓం ప్రకాష్ దీపక్, సైన్ శ్రీకాకుళం, విజయనగరంలో బంగారం కొనుగోలు చేసి వేరే ప్రాంతాలకు డెలివరీ చేస్తుంటారు. మంగళవారం రాత్రి 500 గ్రాముల బంగారాన్ని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో రామాటాకీస్ సమీపంలో వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఎలాంటి బిల్లులు లేకపోవడంతో బంగారాన్ని సీజ్ చేసి ఆదాయ పన్ను శాఖకు పోలీసులు అప్పగించారు. బంగారం విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.